# అంకుల్ డైనమైట్



గబ్బిట కృష్ణమోహన్

మూలం: పి.జి. వుడ్‌హౌస్

# అంకుల్ డైనమైట్

మూలం :

పి.జి.వుడ్‌హౌస్

అనుసృజన :

గబ్బిట కృష్ణమోహన్

# అంకుల్ డైనమైట్

ఉప్పలూరు, ఇందుపల్లి, గుడ్లవల్లేరు లాంటి పల్లెటూళ్ళని కలుపుతూ బందరు వెళ్ళే మీటరుగేజి ప్యాసింజరు రైలు ఆరోజు మధ్యాహ్నం దట్టంగా పొగ వదుల్తూ బద్ధకంగా బెజవాడ స్టేషను వదిలి నత్తనడక సాగించింది. ఆ రైల్లో రోజూ క్రమం తప్పకుండా ప్రయాణం చేసే వాళ్ళు బందరు చుట్టుపక్కలున్న గ్రామాల్నించి పాలబిందెలతోను, పెరుగు కుండల తోను తెల్లవారురుఝామునే పాలబండిలో బయల్దేరి బెజవాడకి యివతలున్న సత్యనారాయణపురం స్టేషన్ బయట అమ్ము కుంటారు కొందరు; మరికొందరు బిందెల్నిండా తెచ్చిన పాలని వూళ్ళో హోటళ్ళకి సరఫరా చేసి ఆ వూరి అవసరాలని ఆ విధంగా తీర్చి పుణ్యం కట్టుకుంటారు. అలా వర్తకం ముగించుకుని యిళ్ళకి తిరిగెళ్ళేందుకు ఈ మధ్యాహ్నం రైలు మంచి సదుపాయం. దీంట్లో ప్రయాణించే వాళ్ళందరూ విధిగా టిక్కెట్టు కొనే ఎక్కుతారని రైల్వేవాళ్ళు కూడా వొప్పుకోరు.

ఆ రైల్లో ఇంటరు క్లాసు సదుపాయం కూడా వుంది. డబ్బూ, దర్పం వున్నవాళ్ళు దాంట్లోనే ప్రయాణం చేస్తారు. ఇవాళ ఆ డబ్బాలో యిద్దరు ప్రయాణీకులు వుండటం కాకతాళీయం. వాళ్ళలో ఒకతను యువకుడు. మనిషి నిండు విగ్రహం, భారీగా కండలు తిరిగున్నాయి. మొహం మాత్రం కమిలిపోయి నల్లగా బొగ్గు పులిమినట్టుంది. రెండో ప్రయాణీకుడు ఆ యువకుడికన్న వయసులో యించుమించు ముప్ఫై ఏళ్ళు పెద్ద. వయసులో పెద్దవాడే అయినా సన్నగా, పొడుగ్గా, నిగనిగలాడే తెల్లటి మీసంతో దర్జాగా వున్నాడాయన. ఆయన కళ్ళు మిలమిల మెరుస్తూ, మొహంలో చలాకీ తనం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. గతించిన కాలంలో ప్రతి ఒక్క నిమిషాన్ని ఎంతో ఖుషీగా వుల్లాసంగా గడిపినట్టు, ముందురోజులు కూడా అదే విధంగా గడపాలన్న పట్టుదల వున్నట్టు ఆయన మొహంలో స్పష్టమవుతుంది. నెత్తిమీది టోపీ షోగ్గా పక్కకి వొరిగించి పెట్టుకుని పైపు ముట్టించి తాపీగా పీల్చడం మొదలెట్టాడాయన. రైలు బయల్దేరి పది నిమిషా లయింది. ఇంతసేపూ నిశ్శబ్దమే వుంది వాళ్ళిద్దరి మధ్య. అప్పటిదాకా తోటి ప్రయాణీకుడ్ని కళ్ళ కొసల్నించే గమనిస్తూ కూర్చున్న యువకుడు ''ఊఁ'' అంటూ గొంతు సవరించుకున్నాడు. ఆఁ ... ఆఁ ... అని గొణిగినట్టు చేశాడు. దానికి ఆ వయసుమళ్ళిన వ్యక్తి ఏవిటన్నట్టు తల పైకెత్తి చూశాడు. దాంతో అతను మరీ నల్లబడిపోయి నోరెందుకు విప్పానా అనవ సరంగా అని మనసులో అనుకుంటూ యిలా అన్నాడు: 'క్షమించాలి, మీరు జమీందార్ సోమేశ్వర్రావుగారు కదూ?'

'ఔను బాబూ, నేనే ఆయన్ని.'

'సంతోషం.'

పెద్దాయన ఆశ్చర్యపడ్డాడు.

'అసలా సంగతంటే నాకే చాలా సంతోషం, మరి నీక్కూడా ఎందుకు బాబూ సంతోషం?'

'ఏమీ లేదండీ, మీరా కాదా అని అనుమానం వచ్చింది.' అలా అని, అయినా రైల్లో తారసపడ్డ ప్రతివాడినీ పలకరిస్తూ పోతుంటే ఏం తంటానో అనుకుని కొంచెం తటపటాయించాడతను. 'అసలండీ, మిమ్మల్ని నేను బాగా ఎరుగుదును. మీవాడు శేషావతారం, నేనూ చిన్నప్పుడు కలిసి ఆడుకునేవాళ్ళం. ఆ విధంగా మీయింటికి తరచు వస్తూ పోతూ వుండేవాడిని. మీకు గుర్తుందో లేదో, ఓసారి మీరు, ముద్దొస్తున్నావురా అని పావలాకాసు యిచ్చి తాయిలం కొనుక్కో అన్నారు.'

'ఔనా, తిని కూచుంటే కొండలైనా తరిగిపోతాయని వూర్కే అంటారా?'

'మీరు నన్ను గుర్తుపట్టినట్టు లేదు, నాపేరు వరప్రసాదు. పూర్తి పేరు – యాకమూరి భద్రకాళీ వరప్రసాదు.'

'హోర్నీ, బలేవాడివయ్యా. ఔను నువ్వే కదూ, గుర్తుపట్టకపోవటవేమిటయ్యా నిన్ను. ''అవునూ, మనవాడున్నాడే, అదే మన యాకమూరి భద్రప్రసాదు, ఏమైపోయాడు చెప్మా'' అని నీగురించి మా ఆవిడని అడగని రోజు లేదంటే నమ్ము,' అన్నాడు జమీందారు రావుబహదూర్ సోమేశ్వర్రావు హృదయపూర్వకంగా అబద్ధాలాడేస్తూ.

'అలాగా, సంతోషం. జమీందారిణిగారు కులాసాగానే వున్నారు కదా?'

'ఓ, ఆవిడకేం బ్రహ్మాండంగా వుంది.'

'సంతోషం. చిన్నప్పుడోసారి నాకు అణా బిళ్ళ యిచ్చారావిడ.'

'ఔనయ్యా, ఆడవాళ్ళకి మగవాళ్ళకన్నా చెయ్యి విసులుబాటుతనం తక్కువని గుర్తుపెట్టుకో. బహుశా వాళ్ళ మెదడు చుట్టూ వుండే బొమికల నిర్మాణ పద్ధతే దానికి కారణం కావచ్చు. బావుందయ్యా, నా శ్రీమతిగారు నిక్షేపంలా వుంది. నిన్ననే ఆవిడగారిని చెన్నపట్నంలో స్టీమరెక్కించి వొస్తున్నాను. రంగూనుకి పంపానావిణ్ణి.'

'రంగూనుకా?'

'అపార్థం చేసుకోకు, ఆవిడ కోరిక మీదే పంపిచాలేవయ్యా.'

ఆ కవిలిపోయిన పండుకి విషయం అర్థం చేసుకోటానికి కొంత వ్యవధి పట్టింది. అలవాటుగా సంతోషం అన బోయి, తమాయించుకుని, శేషావతారం ఎలా వున్నాడని అడిగాడు.

'ఓ, శేషావతారం ఉజ్జ్వలంగా వెలుగుతున్నాడు. గెలిచిన వీరుడ్లా దేశమంతా బలాదూరు తిరుగుతున్నాడు. మలయాలో స్థిరపడ్డ అతని వేలు విడిచిన మేనమామొకడు ఈమధ్యనే చనిపోతూ తన ఆస్తంతా వీడికే చెందాలని రాసి పోయాడు. దాంతో మా శేషావతారం ఇప్పుడు తల మహా పైకుత్తుకుని తిరుగుతున్నాడంటే నమ్ము. పైగా పెళ్ళి చేసుకోవా లని నిశ్చయించుకున్నాడు కూడా.'

'మంచిది.'

ఇప్పటిదాకా కేవలం సంతోషం అంటూ సరిపుచ్చి యిప్పుడు మంచిది అని కూడా దానికి తోడుగా అనటంతో విస్తరిస్తున్న వరప్రసాదు పదజాలాన్ని చూసి రావుబహదూర్ సోమేశ్వర్రావు ముచ్చటపడ్డాడు.

'ఔను, మా అవతారం యిప్పుడు చాలా ఆనందంగానే వున్నా, నాకు మాత్రం కొంచెం సందేహంగానే వుందయ్యా. చూడు వరప్రసాదూ, అందరికీ అన్నివిధాలా అనుకున్నవన్నీ నూటికి నూరుపాళ్ళూ జరగవు అన్న సత్యం నీకు తెలుసో లేదో. మాటవరసకి చూడు – ఎల్లయ్య అనేవాడు ఆనందంతో వుబ్బి తబ్బిబ్బవుతుంటే, పుల్లయ్య అనేవాడు మొహం మాడ్చుకుని విచారంతో కుంగిపోతూ వుండొచ్చు. ఆవిధంగానే రామయ్యో, సుబ్బయ్యో, ఆమాటకొస్తే వల్లకాట్లో రామనాధమో. ఎందుకు చెబున్నానంటే మావాడు, అవతారం, వున్నాడే వాడి ప్రణయ ఘట్టమే చూడు. అసలతను యిప్పుడనుకున్న అమ్మాయిని కాకుండా, నాకు బాగా తెలిసున్న మరో పిల్లని చేసుకుంటే ఎంతో బావుంటుందని నా అభి ప్రాయం మొదట్నించీను. పైగా ఆ పిల్ల నాకు చాలా దగ్గిర కూడాను. చిన్నప్పట్నించి అల్లారుముద్దుగా పెరిగింది. యవ్వ నంలో ప్రవేశించి యిప్పుడా పిల్ల మంచి నిదానంతో, తనదైన వ్యక్తిత్వం ఆపాదించుకుని ఠీవితో వుట్టిపడుతోంది. పైగా ఆడపిల్లలకి వుండాల్సిన లక్షణాలన్ని రంగరించుకుని వుందని నా అభిప్రాయం. ఇకపోతే, ఆ పిల్లకున్న లోకజ్ఞానం వుంది చూశావూ అది, యిద్దరికి సరిపడేంత వుందనుకో. అసలీ ఒక్క సంగతే చాలు, మావాడు – ఘనత వహించిన కనక

వల్లి శేషావతారానికి – కాబోయే భార్యలో వుండాల్సిన సుగుణం. కాని ఎందుకనో ఆశించినట్టు జరగడం లేదు.  అయినా ప్రస్తుతానికి దీన్ని యిక్కడ్తో వదిలేద్దాం. చివరికి అంతా మంచిగానే జరగుతుందని ఆశిద్దాం, అంతేకదూ?'

'ఔనండీ, అంతేకదా మరి.'

'సంతోషం. ఇప్పుడీ సరికొత్త అమ్మాయిని నేనింకా కలవలేదు కాని, బాగానే వున్నట్టనిపిస్తోంది నాకు. అసలు ముఖ్యంగా కావాల్సింది – మావాడు ఒక యింటివాడు కావడం. అది కూడా ఎంత తొందర్లో అయితే అంత మంచిది. లేకపోతే, రేప్పొద్దున ఓ బర్మాముడిని వెంటేసుకొచ్చి ఇదిగో ఈవిడే నా భార్య, ఈమధ్యనే బర్మాలోనో, మలయాలోనో పరిచయమైందని చెప్పగల సమర్థుడే వీడు. అందంగా వున్న ఆడపిల్లని చూడగానే మైనంలా కరిగిపోతాడు. బహుశా ఆ సంగతి నీక్కూడా తెలిసే వుండొచ్చు.'

'లేదండీ, చిన్నప్పుడెప్పుడో కలవటమే కాని ఆ తరవాత మళ్ళీ కలవలేదు మేమిద్దరం.'

'దానికేంలే, ఆరోజుల్లో కూడా ఈ పువ్వునించి ఆ పువ్వు మీదికి ఎగిరే సీతాకోకచిలకలా వుండేవాడు. ఇంకో సంగతి – వాడి గుమ్మం ముందుండే  కాళ్ళు తుడుచుకునే పట్టా మీద *స్వాగతం* అని ఎప్పుడూ రాసిపెట్టే వుంటుంది.'

'అలాంటి వాటికింక స్వస్తి చెప్పుతాదులెండి.'

'అలానే అనుకోవాలి. కాని మచ్చలపులి తన మచ్చలు మార్చుకోగలదా? వేమన ఏమని రాశాడు? ఎలుగు తోలు తెచ్చి ఎందాక వుతికినా నలుపు నలుపేగాని తెలుపు కానందువల్ల, నీగ్రోల వొంటిరంగు మారుతుందా? అన్నట్టు నీగ్రోల ప్రసక్తి వచ్చింది కనక నువ్వేమీ అనుకోకపోతే ఓ సంగతి అడుగుతా – నిన్నెవరన్నా పుతం పెట్టి వండటానికి ప్రయత్నించారా? లేకపోతే గొడుగు లేకుండా మండుటెండల్లో తిరిగావా ఏవిటి?' అంటూ ఇలా వ్యక్తిపరమైన  ప్రశ్నలు వేశాడు రావుబహదూర్ సోమేశ్వరావు.

ఉన్నట్టుండి అలా అడిగేసరికి వరప్రసాదు యిబ్బందితో మేకలా అరిచి ఒక విధమైన నవ్వు నవ్వాడు.

'నా చర్మం కొంచెం నలుపు తిరిగింది, దానికి కారణం ఈమధ్యనే మూడునెలల పాటు అండమాన్లో కారడవుల మధ్య గడపడం. ఇప్పుడు అక్కడినించే తిరిగొస్తున్నా. మా యింటికి వెడుతున్నాను.'

'ఈ చుట్టుపక్కల్లోనే వుందా  మీయిల్లు?'

'ఔనండీ, గుడ్లవల్లేరు దగ్గిరున్న చికినంపూడి.'

'పెళ్ళి అయిందా?'

'ఇంకా కాలేదండి. మా మేనమామతో వుంటున్నాను. ఆమాటకొస్తే అసలు మా మేనమామే నాతో వుంటున్నట్టు లెక్క.'

'ఏవిటో తేడా?'

'విషయమేమిటంటే చికినంపూడి జమీందారీ నాది. నాకు పదహారేళ్ళు కూడా నిండకుండానే మా నాన్నగారు పోయారు. దాంతో తోట్లవల్లూర్లో వుండే మా మావయ్య చొరవగా వచ్చి యిక్కడి వ్యవహారాలన్నీ తన అధీనంలోకి తీసుకున్నాడు. ఆరోజు నించి ఇక్కడే తిష్ఠ వేసుక్కూచున్నాడు. పెత్తనమంతా ఆయన్దే. అతని వైఖరి చూస్తుంటే వున్నదంతా తనదే అన్నట్టు భావిస్తున్నాడని అనిపిస్తుంది,' అంటూ వాపోయాడు. 'అంతెందుకు మచ్చుకు ఒకటి రెండు విషయాలు

చూడండి మీకే తెలిసిపోతుంది. మా బంగళాలో వున్న అతి విశాలమైన గదిని తాను ఏళ్ళ తరబడి పోగుచేసి దాచుకున్న ఆదివాసుల హస్తకళాఖండాలతో నింపేసి మ్యూజియంలా తయారుచేసి పెట్టాడు.'

'ఓహ్, అడవుల్లో వుండే ఆదివాసులు తయారుచేసే బొమ్మల్ని మీ మావయ్య ముచ్చటగా పోగుచేస్తాడా? ఏవిటో భగవంతుడి లీలలు.'

'అంతట్తో అయిపోలేదు. బంగళాలో విశాలమైన పడగ్గది ఎవర్ది? నాది కాదు, మా మావయ్యది. పొద్దున్నే పేపరు రాగానే ఎత్తుకుపోయి ముందెవరు చదువుతారు? నేను కాదు – మావయ్యే. ఫిల్టర్లోంచి కాఫీ డికాషను దిగుతుం డగానే లేచి తాగేదెవరనుకున్నారు?'

'నువ్వు చెప్పక్కర్లేదు, నేను వూహించుకుంటాన్లే, మీ మావయ్యే కదూ?'

'ఔను, ఆ చచ్చినాడే.'

రావుబహదూర్ సోమేశ్వర్రావు కాసేపు ఆలోచిస్తూ వుండిపోయి మీసాలు తడుముకుని యిలా అడిగాడు: 'వర ప్రసాదూ, నువ్వు చెబుతున్నదాన్ని బట్టి, ఆ చెప్పేటప్పుడు నీ వాలకం బట్టి చూస్తుంటే, మీ మావయ్య నీతో కలిసి ఆ బంగ ళాలో వుండటం నీకు సుతరామూ యిష్టం లేదనిపిస్తోంది, అవునా?'

'అవును.'

'మరి వెళ్ళగొట్టలేకపోయావా అతన్ని?'

అప్పటివరకు వరప్రసాదు మొహం గంభీరంగా వుంది, ఈ ప్రశ్నతో దానికి బదులు మొహమాటం చోటు చేసు కుంది. రావుబహదూర్ సోమేశ్వర్రావు మంచివాడిలానే కనిపిస్తున్నా అంతగా పరిచయమున్న మనిషి కాదు. మరి ఆయన ప్రశ్నకి జవాబివ్వాలంటే – అదే మావయ్య కూతురు ఉషారాణిని తను ఎంతగా ప్రేమిస్తున్నది బయట పెట్టాల్సి వస్తుంది.

అందుకని, 'ఆమాట కూడా నిజమే కాని, దాన్ని ఆచరణలో ఎలా పెట్టాలో తెలీడం లేదండీ,' అని ముక్తసరిగా జవాబిచ్చి ఫిడేలు తీగల మీద కమానుతో రాసినట్టు బూటు కొనతో నేలమీద రాపాడుతూ కూచున్నాడు.

'బహుశా ఏవో అడ్డంకులున్నాయి గాబోలు.'

'ఔను, చాలా అడ్డంకులున్నాయి.'

'నేను అర్థం చేసుకోగలన్లే.'

సున్నితమైన కుటుంబ వ్యవహారాల్లో తన జోక్యం ఎందుకని రావుబహదూర్ సోమేశ్వర్రావు లోతుగా ఆరా తియ్యడం విరమించుకున్నాడు. పక్కనే వున్న ఇంగ్లీషు పేపర్లో క్రాస్వర్డ్ పజిల్ పేజి తీసి దాంట్లో మునిగిపోయాడు. వరప్రసాదు కిటికీలోంచి బయటి ప్రకృతిని చూస్తూ కూచున్నాడు. చూస్తూ కూచున్నాడన్నమాటే కాని చెట్లు, చేమలు కని పించాల్సిన చోటంతా ఉషారాణి అందమైన గుండ్రటి మొహమే కనిపిస్తోంది. సూర్యోదయంలా విరాజిల్లుతోంది అన్ని చోట్లా. అవున్లే, ఇంక ఇలా వూహించుకుంటూ గడిపే కాలం అయిపోయింది, తను వచ్చేశాడుగా, యిహ వూహల్తో పని లేదు. ప్రత్యక్షంగా ఎదుట వున్నప్పుడు మొహంలో మొహం పెట్టి ఆ అందమైన కళ్ళల్లోకి చూసేందుకు యింక తడవు ఎక్కువ లేదు; ఒకవేళ తను పక్కకి తిరిగి నుంచుంటే సుందరమైన ఆమె భంగిమని కళ్ళతోనే తాగేయొచ్చు.

అలాంటి పరిస్థితిలో తను చెయ్యవలసింది ఏవిటి? ఎప్పటిలా నోరు వెళ్ళబెడుతూ కాళ్ళు మారుస్తూ నుంచోడ మేనా? మూడు నెలలపాటు అడవుల్లో తిరిగొచ్చినందుకు పిరికితనం వదిలించుకుని, తొమ్మిదేళ్ళుగా మనసులోనే దాచి పెట్టుకున్న తన ప్రేమని ఆమెకి వెల్లడించాలా? ఆ, అదే తన తక్షణ కర్తవ్యం అని ముందు అనిపించినా, అది సంభవం కాదని తోచింది వరప్రసాదుకి. మోకాలు మీద చిన్నగా తట్టిన తట్టు వల్ల అతని ఆలోచనలకి భంగం కలిగింది.

'గుడ్లవల్లేరు స్టేషనొచ్చేస్తోంది,' అన్నాడు రావుబహదూర్ సోమేశ్వర్రావు.

'ఆఁ ... ఆఁ ... అవును వచ్చేస్తోంది కదా.'

'నువ్వింక లేచి నడుముకి పట్కా బిగించి దిగడానికి సిద్ధమవచ్చు.'

'అవును.'

వరప్రసాదు లేచి పైనున్న సామాను దించాడు. ప్లాట్‌ఫాం దగ్గర పడుతుంటే వున్నట్టుండి పొలికేక పెట్టి అలాగే విస్తుపడి చూస్తూ వుండిపోయాడు. తన కళ్ళని తను నమ్మాలో లేదో తెలీక వేళ్ళతో కనురెప్పల్ని నులుముకున్నాడు; వర సగా రెండుసార్లు రెప్పలార్పి చూశాడు. కళ్ళేమీ మోసం చెయ్యట్లేదు. ముందు కనిపించిన దృశ్యమే మళ్ళీ ప్రత్యక్ష మయింది. గుడ్లవల్లేరు స్టేషను మామూలు రోజుల్లో అయితే ఎవర్నీ ఏవిధంగా ఆకర్షించదు, భయం కూడా కలిగించదు. జెండా పట్టుకున్న లావుపాటి మీసాల స్టేషన్ మాస్టార్ని చూస్తే అక్కడి విశేషాలన్నీ చూసేసినట్టే. కళ్ళజోడు ముక్కు కిందికి వేలాడుతూ, పంచె ఎగదీసి కట్టి పాలబిందెల్ని దింపుతూ కనిపించే పోర్టరు పేరయ్య విచిత్రంగా అనిపిస్తే అది వేరే విషయం. అంతకి మించి అక్కడ మరింకే విశేషాలు వుండవు. ప్రశాంతత అన్న మాటకి పర్యాయపదం ఆ స్టేషను.

కాని ఈరోజు అదంతా మారిపోయి గుడ్లవల్లేరు జనాభా యావత్తు అక్కడే చేరినట్టు కనిపిస్తోంది. ఆ చివర్న అణా బిళ్ళ వేస్తే బరువుతోపాటు భవిష్యత్తు కూడా తెలిపే మెషిన్ దగ్గర్నించి ఈ చివర్న – పేరయ్య పోర్టరు తన చీపిరి, బొక్కెన దాచుకునే షెడ్డు వరకూ ప్లాట్‌ఫామంతా జనంతో కిక్కిరిసి వుంది.

కేవలం కండబలం మాత్రమే చూసి ఎంచిన యిద్దరు మనుషులు పొడుగాటి గుడ్డ బ్యానర్ని ఎత్తి పట్టుకున్నారు. వున్న గుడ్డని సమానంగా పంచలేక ఆ వూరి పెయింటరు దానిమీద

**స్వాగతం! సుస్వాగతం!! శ్రీ వరప్రసాదు** గార్కి

అని అందంగా, గుండ్రంగా రాశాడు. ఇదికాక బ్యాండుమేళం, స్కౌటు పిల్లలు, ఒక పోలీసు, యిద్దరు పురోహితులు కలగా పులగంగా ఆడ, మగ; వీటికి తోడు కోలాహలంగా వున్న ఈ కార్యక్రమాన్ని నడిపిస్తున్నది తనే అన్నట్టు కనిపించే తెల్లటి గుబురు మీసాల్తో ఆజానుబాహువైన వ్యక్తి – యివన్నీ కనిపించాయి. కాశీమజిలీ కథల్లో శాపానికి గురి అయిన రాకుమారుడిలా వరప్రసాదు కిటికీ దగ్గర నోరు వెళ్ళబెట్టి చూస్తూ రాయిలా నుంచుండిపోయాడు. ఉన్నట్టుండి అశక్తుడైన ఆ కుర్రాణ్ణి చూడగానే రావుబహదూర్ సోమేశ్వర్రావుకి పరిస్థితి అర్థం చేసుకోటానికి కష్టం కాలేదు.

ప్రజల దృష్టిలో సాధ్యమైనంతవరకు మరుగ్గా వుండాలని తలపోసే ఈ యువకుడు – తనకోసం ఎవరో ఘనంగా స్వాగత సత్కారాలని అందిస్తున్నారనే విషయం గ్రహించి ఒక్కసారిగా ముడుచుకుపోయాడని, అందుకే, వేట గాడు ఎక్కుపెట్టిన బాణం ముందు నుంచున్న లేడిపిల్లలా వొణికిపోతున్నాడని గ్రహించాడాయన. రావుబహదూర్ సోమేశ్వర్రావుకి పబ్లిసిటీ అంటే వల్లమాలిన యిష్టం. అసలు దాన్నెంతగానో అభిమానిస్తాడు, పైగా అభిలషిస్తాడు. తనకే కనక యిలా బాజా భజంత్రీలతో, స్కౌట్ పిల్లలతో స్వాగతం చెబుతూ ఎవరన్నా వస్తే రైలు ఆగకుండానే దూకేసి, అది ఆగే లోపలే వాళ్ళ దగ్గర్నించి పూలదండలూ వగైరాలన్నీ స్వీకరించి వుండేవాడు. కాని, తోటి ప్రయాణీకుడు అలాంటివాడు కాదు. అతని పరిస్థితి చూసి ఆయనకి మహా జాలి వేసింది.

ఈ జమీందారు అందరిలా కాదు, కార్యశూరుడు. వేరే వాళ్ళయితే సానుభూతి చూపిస్తూ భుజం చరిచి వూరు కుంటారు, ఈయన ధోరణి వేరు.

'సీటు కిందికి దూరేసి దాక్కో,' అని వెంటనే సలహా యిచ్చాడు.

వరప్రసాదుకి ఈ సలహా ఆకాశవాణి వాక్కులా తోచింది. కాచి చూస్తున్న దేవతెవరో విషమ పరిస్థితిలో వున్న తనకి ఆ సందేశాన్ని పంపించిందనుకున్నాడు. క్షణం వృథా చెయ్యకుండా ఆయనిచ్చిన సలహా పాటించాడు. మరి కాసే పటికి చిన్న కుదుపుతో రైలు మళ్ళీ బయల్దేరింది.

బండి కొంచెం వేగం పుంజుకున్నాక సీటు కింద నించి పాకుతూ బయటికొచ్చిన వరప్రసాదుకి ముచ్చట పడుతూ ఎంతో అభిమానంగా తననే గమనిస్తున్న రావుబహదూర్ సోమేశ్వర్రావు కనిపించాడు.

'రెప్పపాటులో ఎంత లాఘవంగా దూరవయ్యా నువ్వు,' అన్నాడు సోమేశ్వర్రావు, ఆనందంతో మెచ్చుకుంటూ. 'పుట్టలోకి పాము, కన్నంలోకి ఎలిక దూరినంత వేగంగా చేశావాపని. అసలది చూస్తుంటే యిలాంటివాటిల్లో నీకు పూర్వానుభవం చాలా వున్నట్టనిపిస్తోందయ్యా. ఏవిటీ, లేదా? ఆశ్చర్యంగా వుందే! వరప్రసాదూ, చాలా సంవత్సరాల అనుభవం వుందని నీకో సర్టిఫికెట్టు పారేయొచ్చయ్యా! అది సరే, నువ్వు మాత్రం వాళ్ళని భలే కంగు తినిపించావులే. బ్యాండుమేళం వాళ్ళు గుడ్లు తేలేశారు. నువ్వీ రైల్లో రాలేదని తెలుసుకున్నాక వాళ్ళకెంత ఆశాభంగమైందో తెలుసా?'

వరప్రసాదు యింకా తేరుకోలేదు. అంతమంచి సలహా యిచ్చిన ఆ మహానుభావుడిని సాదరంగా చూస్తూ తడి ఆరిన గొంతుతో పొడి ముక్కల్తో కృతజ్ఞతలు వెల్లడించుకున్నాడు.

అందుకు రావుబహదూర్ సోమేశ్వర్రావు యిలా అన్నాడు: 'వద్దయ్యా, నువ్వేం చెప్పక్కర్లేదు. పరోపకారి పాపన్నలా అందరి జీవితాల్లో ఎలాగైనా యింత సంతోషాన్ని కలిగించటమే నా కర్తవ్యంగా ఎంచుకున్నాను. ఇంత వెలుగు, ఇంత తీపి వుదారంగా పంచిపెట్టడమే నా ధ్యేయం.'

'అయినా నాకు మాత్రం యిది ఎప్పటికీ మరవలేని సంఘటనండీ,' అని వరప్రసాదు మనస్ఫూర్తిగా చెప్పాడు. 'నా బాధ మీకు అర్థమయిందో లేదో, మీరు కనక సమయానికి ఆదుకోకుండా వుంటే, రైలు దిగ్గానే నేనో చిన్న వుపన్యాసం యిచ్చి, ముక్కులోడుతుండే ఆ పిల్లల్ని ముద్దు పెట్టుకోవాల్సి వచ్చేది.' దాన్ని తలుచుకుంటుంటేనే అతనికి వొళ్ళు గగుర్పొడిచింది. 'చూశారుగా మీరు, ఓ లక్షమందుంటారు చేతుల్లో పూలదండలు పట్టుకుని, ఒకటే వాసన!'

'చూశానయ్యా, చూశాను. చిన్నప్పుడు నువ్వు ఆడుకోడానికి మా యింటికి వస్తూ పోతూండే రోజులకి, యివాల్టికి మధ్యకాలంలో నువ్వెంత ఎదిగావో ఈ సంఘటన వల్ల విశదంగా స్పష్టమైంది. దండలు చేత్తో పట్టుకొచ్చింది ఏదో మామూలు ఎల్లయ్య, మల్లయ్య, పుల్లయ్యలకి కాదని జీవితాన్ని కాచి వడపోసిన నాకు బాగా తెలుసయ్యా. నన్ను చూడు – ఈ ప్రాంతంలో పేరు మోసిన జమీందార్ని, పైపెచ్చు రావుబహదూర్ని. అయినా ఏరోజన్నా మచ్చుకి ఒక్కటంటే ఒక్క దండ ఎప్పుడన్నా వేశారా? వరప్రసాదూ, నువ్వేదో సాధించినందుకే కదయ్యా ఈ ఆర్భాటం,ఈ దర్బారూను. ఇంతకీ నువ్వు చేసిన ఘనకార్యం ఏమిటి?'

'అబ్బే, నేనే ఘనకార్యం చెయ్యలేదండి.'

'ఏవిటో తమాషాగా వుందే మరి. వాళ్లా ఘనస్వాగతం ఏర్పాటు చేసింది నీకోసమే కదయ్యా. నీకు కాక వేరే ఎవళ్ళకో అయితే మరి ఆ బ్యానరు మీద, స్వాగతం! సుస్వాగతం!! శ్రీ వరప్రసాదుగార్కి, అని రాస్తారటయ్యా మరీనూ?'

‘ఆ మాట కూడా నిజమేననుకోండి.’

‘పోనీ దీనికంతటికి మూలకారణం ఎవరో తెలుసా?’

‘దీనికి ఆధ్వర్యం మా మావయ్యే అయుండాలండీ.’

‘ఎవరూ, కోడి రామ్మూర్తి పహిల్వాన్లా వున్న ఆ మీసాలాయనేనా?’

‘ఆయనే. ఆయన చలవే యిదంతా.’

‘ఎందుకు చేస్తున్నాడంటావ్ మరి?’

‘అదే అర్థమయిచావడం లేదండి.’

‘పురోహితులు, బ్యాండు మేళం, స్కౌటు పిల్లలు వగైరాలన్నీ హాజరు పరిచారంటే దానికి తగ్గట్టు నువ్వేదో సాధించే వుంటావయ్యా. బుర్ర గోక్కుంటూ కాస్త ఆలోచించు బాబూ.’

‘అలా అంటే, ఆమధ్య అండమాన్ దీవుల్లో కొత్త ప్రదేశాలు అన్వేషించటానికని ఒక బృందం వెడుతుంటే నేను కూడా అందులో పాల్గొన్నాను. అంతకు మించి మరే ఘనకార్యం చేయలేదు.’

‘ఓ, మరింకేం కావాలి! అందులోను అండమాను, నికోబారుల్లోను ఆయె, పైగా అన్వేషణా యాత్ర కూడాను. ఇంతకుమునుపు నువ్వు అండమాన్నించి తిరిగొస్తున్నానని అన్నప్పుడు కాస్తయినా నాకు తట్టలేదు సుమా. నీదేదో పోక చెక్కల వ్యాపారమో, కలప వ్యాపారమో కావుల్ను అనుకున్నా. సరే నువ్వు అండమాను దీవుల్లో అన్వేషించి వస్తున్నదే దీనికి కారణం. అయినా తెలీక అడుగుతున్నా, అసలు అంతపని ఎందుకు చెయ్యాల్సొచ్చిందయ్యా నీకు? నువ్వేమన్నా భగ్న ప్రేమికుడివా ఏవిటి, ఆ అమ్మాయిని మరిచిపోవాలని అక్కడకెళ్ళి కూచునొచ్చావా కొన్నిరోజులపాటు?’

ఆమాట విని వరప్రసాదు కొంచెం సిగ్గు పడ్డాడు. మేనమామ కూతురు ఉషారాణితో ఎదుగు బొదుగు లేని తన ప్రేమని మరిచిపోడానికి విరుగుడు మందుగా యిలాంటి పని చేయాల్సొచ్చింది. కాని అలాంటి వ్యాధికి యిలాంటి మందు పనికిరాదని ముందే తెలిసుంటే ఆ పని చేసుండేవాడు కాదు తను.

‘అవును, అలాంటిదే అనుకోవచ్చండీ, ఒకవిధంగా.’

‘మా కాలంలో అయితే మేము హిమాలయాల్లోకెళ్ళి గడ్డాలు, మీసాలు పెంచేసుకునే వాళ్ళం. అయినా నాకు తెలీక అడుగుతున్నా, అసలు అండమాను దీవుల్ని ఎంచుకోడంలో నీ వుద్దేశ్యం ఏమిటి?’

‘అదా, ఆమధ్య ఆంధ్రపత్రికలో ఒక వార్త పడింది. మేజర్ గోవిందరాజుల్నాయుడనే ఆయన అండమాను దీవుల్లో మునుపెవరూ చేరని ప్రదేశాల్ని అన్వేషించేందుకు ఒక బృందాన్ని తీసుకెళ్ళి, అక్కడ నివసించే ఆదివాసుల జీవితాల్ని అధ్యయనం చెయ్యబోతున్నాడని చదివాను. నేను కూడా ఆ బృందంతోపాటు వెడితే బాగుంటుందనిపించి నా పేరు కూడా నమోదు చేయించుకున్నా.’

‘అలాగా, ఈ విషయాన్ని ముందే ప్రస్తావించి వైనం కనుక్కుంటే ఎంతో బాగుండేది కదా, నా పొరపాటది. అసలు చిన్నప్పట్నించి నిన్ను ఎరిగున్న పరిచయాన్ని పురస్కరించుకుని మనిద్దరం యింకా మరెన్నో విషయాలు ముచ్చటించుకునివుండాల్సింది. అయితే, మరికొన్ని నిమిషాల్లో నేను దిగాల్సిన వడ్లమన్నాడు స్టేషను వచ్చేస్తుంది. అందువల్ల నీ భవిష్యత్ కార్యక్రమం ఏమిటన్న ప్రశ్న వుత్పన్నమైంది. ఏమిటి నీ ఆలోచన? వెనక్కి వెళ్ళే రైలు కోసం కాచుకునుంటావా?

లేకపోతే నాతో యిక్కడ దిగి బడలిక తీరడానికి నాలుగు చుక్కలు మా యింట్లో సేవించిన తరవాత, నా కార్లో మీ యింటికి పంపించమంటావా?'

'మీకు శ్రమ అవుతుందేమోనండీ అనవసరంగా.'

'ఏం కాదులేవయ్యా, పైగా, యింతకన్న మంచి అవకాశం నాకెప్పుడు దొరికేను, సరేనా? సరే, ఈ విషయం తెమిలింది. ఇహపోతే, మరి మీయింటికి వెళ్ళాక స్వాగత సమారంభాల్లో అప్పుడు నువ్వెందుకు కనిపించలేదని మీ మావయ్య అడిగితే సంజాయిషి ఏమని యిచ్చుకుంటావ్?'

ఆ విషయాన్ని గురించే ఆలోచిస్తున్నట్టు వరప్రసాదు మొహంలో కనిపిస్తోంది. దాన్ని తలుచుకుని, అండమాన్లో వుండే మొసలేదో అమాంతం తొడ పట్టుకుని కరిచినట్టు, ఒక్కసారి వూపిరి బిగబట్టుకుని కళ్ళు మూసుకున్నాడు.

'నేనదే ఆలోచిస్తున్నానండీ,' అన్నాడు.

'ఏదో మంచి కట్టుకథ – లొసుగుల్లేనిది కావాలి. నువ్వు రైల్లో లేవని గ్రహించిన తరవాత మీ మావయ్య చాలా ఆశాభంగం చెందినట్టు నాకనిపించింది. పట్టలేని కోపంతో మొహం జేవురించింది. చాలా ప్రమాదకరమైన వ్యక్తిలా వున్నాడతను. అతని కాటు యమగండమే అవ్వచ్చునిపించింది. తెలీకడుగుతున్నా, ఏం చేస్తూంటాడాయన – కుస్తీ పహిల్వానా?'

'అబ్బే కాదండీ, నల్లమల కీకారణ్యాల్లో ఏజెన్సీ ఆఫీసరుగా చాలాకాలం పనిచేసి రిటైరయ్యాడు.'

'ఈ మాజీ ఏజెన్సీ ఆఫీసర్ల సంగతి నాకు బాగా తెలుసయ్యా, గట్టిపిండాలు. అంచేత అతన్ని శాంతపరిచేందుకు మనం అన్నివిధాలా ప్రయత్నం చెయ్యాలి. అన్నట్టు ఆయన పేరేవిటో నువ్వింతవరకూ చెప్పలేదు కదా?'

'భీమశంకరం. రావుబహదూర్ తాడంకి భీమశంకరం.'

'అవునా? ఇతనేనా ఆయన? చిత్రంగా వుందే!'

'మీకాయన తెలుసాండీ?'

'ఒకప్పుడు బాగా పరిచయం, నలభై యేళ్ళయింది అతన్ని చూసి. మేమిద్దరం ఒకే స్కూల్లో చదువుకున్నాం.'

'నిజంగానాండీ?'

'ఆ రోజుల్లో అతన్ని శరభయ్య అని పిలుస్తుండేవాళ్ళం మేమందరం. వయసులో నాకన్న మూడేళ్ళు చిన్న. అయితే మనిషి ఏపుగా వుండటంతో సీనియర్స్‌తో తగాదాలు పెట్టుకోడం, జూనియర్స్‌ని ఏడిపించడం జరిపే వాళ్ళ కోవ లోకి చెందేవాడతను. ఈ రెండో దురలవాటుంది చూశావ్, దాన్ని సరిదిద్దాలని ఓరోజు నేనేం చేశానో తెలుసా? పచ్చి వేపబెత్తం తీసుకుని వాడి వీపు వంచి గట్టిగా దేహశుద్ధి చేశాను. ఆ, అదీ సంగతి, ఇప్పుడర్థమయిందయ్యా స్టేషన్లో ఆ స్వాగత సమారంభాల వెనకున్న రహస్యం. మా దినపత్రికలో వార్త ప్రకారం శరభయ్య ఎన్నికల్లో అసెంబ్లీకి పోటీ చేస్తున్నాడు. అందుకు యిలా జనాన్ని పోగుచేస్తే మంచిదని తోచుంటుంది. నాగరికత సరిహద్దుల్ని మరికొంతమేర విస్త రించిన వ్యక్తితో సంబంధ బాంధవ్యాలున్న నిజాన్ని అతనిప్పుడు మంచి అవకాశంగా వాడుకోటానికి తాపత్రయ పడు తున్నాడు – నాలాగే.'

'అయినా, నాగరికత సరిహద్దుల్ని విస్తరించేందుకు నేనేమీ చెయ్యలేదే!'

‘తప్పయ్యా, తప్పు. నాగరికతని నువ్వు రబ్బరుముక్కని సాగదీసినట్టు ఎగలాగావని నేను ఢంకాపథంగా చెప్ప గలను. ఆ సంగతలా వుంచు. ఇంతకీ ఆయనకి ఎలాంటి కట్టుకథ చెప్పాలన్న సంగతి మరిచిపోతున్నట్టున్నాం మనం. ఊ... ఒక పన్చెయ్. కిటికీలోంచి చల్లటిగాలి వీస్తోంది, ఆ గాలికి కునుకు పట్టేయడంతో లేచేసరికి రైలు కాస్తా గుడ్లవల్లేరు దాటిపోయి వడ్లమన్నాడు చేరుకుంది అని చెబితే ఎలా వుంటుందంటావ్ మరి?’

‘చాలా బాగుంటుందండీ.’

‘అయితే వొప్పుకున్నట్టే కదా మరి? అసలు నాక్కూడా భేషుగ్గా వున్నట్టనిపిస్తోంది. చాలా సింపుల్, అనుమానా లకి ఆస్కారమే వుండదు. పైగా, గతంలో యిలాంటివెన్నో జరిగాయి కూడాను. అతికినట్టు చక్కగా వుంది కదూ, దీంతో గట్టెక్కవచ్చు,’ అని చెప్పి రావుబహదూర్ సోమేశ్వర్రావు మళ్ళీ యిలా అన్నాడు: ‘ఇంతకీ ఇతనేనా శరభయ్య! కాని అలాంటివాడు పెద్ద ఏజెన్సీ ఆఫీసరు హోదా వరకూ ఎదగడం ఆశ్చర్యం కాదుటయ్యా? ఎవరికి ఏం రాసిపెట్టి వుంటుందో ఎవరు చెప్పగలరు అన్నదానికి ఇదో వుదాహరణ తెలుసా?’

‘ఆఖరుసారిగా మీరాయన్ని ఎన్నేళ్ళ కిందట చూశానన్నారు?’

‘ఈ ఉగాదికి సరిగ్గా నలభయి రెండేళ్ళు. ఏం, ఎందుకూ?’

‘ఇంతకాలంగా మీరిద్దరూ ఎందుకు కలవలేకపోయారా అని. అదీ యింత దగ్గర్లో వుంటూ కూడా.’

‘అదా, నేచెబుతా విను వరప్రసాదూ. చుట్టుపక్కల వాళ్ళని దూరంగా వుంచటమే నా పాలిసీ అయ్యా. అయినా దేశ భవిష్యత్తు, దేశ సౌభాగ్యం పల్లె సీమల్లోనే వున్నాయని నీకు తెలీని విషయం కాదుగా. మా ఆవిడ అప్పుడప్పుడు ఏ తిరణాలకనో, తీర్థానికనో నన్ను బయటకి యీడ్చాలని ప్రయత్నం చేస్తూంటుంది, కాని నేను మాత్రం ససేమిరా తల వంచను. పైపు పీల్చడానికి యింత పొగాకు దగ్గిరుంచుకుని ఈ పల్లెసీమ వాతావరణంలో కలిసిపోవడమే బ్రహ్మాండమైన జీవితం అని నా విశ్వాసం. ఇంక మీ మేనమామ సంగతంటావా – నాకు పరిచయమున్న శరభయ్య జ్ఞాపకాల్ని మననం చేసుకుంటే – వయసుమళ్ళిన ఈ శరభయ్యతో సంబంధం పెట్టుకోవాలనిపించదయ్యా. నాకస్సలు యిష్టం లేదు.’

‘మీరు చెప్పినదాంట్లో నిజం లేకపోలేదు.’

‘అలా అని చెప్పి శరభయ్య రాక్షసుల కోవలోకి చెందుతాడని నేనడం లేదు కాని, మావాడు – శేషావతారానికే తెలిసిరావడం లేదు – అలాంటివాడు తనకి పిల్లనిచ్చిన మామగారు కాబోతున్నాడని. ఈ శరభయ్య కూతురు ఉషారాణినే మావాడు పెళ్ళిచేసుకోవాలని నిశ్చయించుకున్నాడు. ఆ అమాయకుడి భవిష్యత్తు ఏం కావాలోననే నా ఆందోళనంతా. ఆహా, యిదిగో వచ్చేశాం మొత్తానికి,’ అన్నాడు రావుబహదూర్ సోమేశ్వర్రావు రైలు నిమ్మదించటంతో. ‘ఇంక దిగుదాం పద. ఇంటికి చేరగానే నాలుగు చుక్కల్తో గొంతు తడుపుకుని బడలిక తీర్చుకుందాం. మనం వెళ్ళేసరికి అవతారం కూడా చేరి వుండొచ్చు. ఈరాత్రి మాయింట్లో గడిపి రేపు చికినంపూడికి వెళ్ళి ఆ పిల్ల తలిదండ్రుల్తో నాలుగురోజులపాటు గడు పుతూ, వాళ్ళ అభిమానం చూరగొనాలని మావాడి తాపత్రయం.’ ఆవిధంగా చెప్పి, రైలు ఆగగానే ప్లాట్‌ఫాం మీదికి అవ లీలగా గెంతేసి హుందాగా నడవసాగాడు రావుబహదూర్ సోమేశ్వర్రావు. అయితే అంత మంచి కుర్రాడిని తను సమ్మెట తీసుకుని ఒక్కసారి నెత్తిమీద మోదినట్టు ఆయన గ్రహించలేకపోయాడు. ఉషారాణి పెళ్ళి నిశ్చయమయిందని వినగానే – బొమికని నవుల్తున్న కుక్కని యీడ్చి డొక్కలో తంతే అది చేసే శబ్దం లాంటి మూలుగు వరప్రసాదు గొంతులోంచి బయటికొచ్చింది. అతని గొంతులోంచి బయటికొచ్చిన శబ్దాన్ని రావుబహదూర్ సోమేశ్వర్రావు విని బహుశ ఎక్కిళ్ళు పట్టుకున్నాయి గావుల్ను అని అపార్థం చేసుకున్నాడు.

*

ఆ వేసవి సాయంత్రం క్రమంగా రాత్రి కావచ్చింది. దెబ్బతిన్న హృదయాన్ని కూడగట్టుకుని వరప్రసాదు అక్కడి నించి వెళ్ళిన చాలాసేపటికి అవతారం తన పూర్వీకుల యింటికి చేరాడు. అనుకోకుండా దారిలో కారు చెడిపోవటం మూలంగా ఆలస్యమైంది. సరిగ్గా రాత్రి భోజనాల వేళకి చేరి, బట్టలు మార్చుకున్న తరవాత కాసేపటికి భోజనాల గదిలో టేబులు ముందు వాళ్ళ బాబాయికి ఎదురుగా కూచుని చేతిలో గ్లాసుతో ప్రయాణం బడలిక తీర్చుకుంటున్నాడు.

అతన్ని చూడగానే రావుబహదూర్ సోమేశ్వర్రావు చాలా సంతోషించాడు. అతిథి మర్యాదల్లో ఎంతమాత్రం లోపం చూపని వ్యక్తి ఆయన. వడ్డించడానికి నౌకరు శేషయ్య వస్తూ పోతూ వుండటంతో సంభాషణ మామూలు కబుర్లకే పరిమితమై వ్యక్తిగత విషయాల జోలికిపోలేదు. ఈమధ్యనే మలయాలో ఆస్తి వ్యవహారాలు చక్కపెట్టుకుని తిరిగొచ్చిన శేషావతారం ఆ కబుర్లన్నీ పూసగుచ్చినట్టు చెప్పుతుంటే; తన భార్యని రంగూనులో పెళ్ళికి పంపించిన వైనం వాళ్ళ బాబాయి చెప్పాడు. దాంతోబాటు అవతారానికి బాల్యమిత్రుడైన వరప్రసాదు రైల్లో కలిసిన విషయం కూడా ప్రస్తావించా డాయన. అయితే వరప్రసాదు లీలగా మాత్రమే గుర్తున్నాడని – యిప్పటికీ కందగడ్డ మొహంతో, లావుపాటి పిల్లాడి రూపమే కళ్ళముందుకి వస్తోందన్నాడు అవతారం. అయినా మర్నాడు చికినంపూడిలో ఎలాగూ కలిసినప్పుడు ముచ్చ టగా స్నేహం మళ్ళీ పెంచుకోవచ్చునని ఎంతో వుత్సాహం చూపించాడు.

ఈ విషయాలే కాకుండా – వాతావరణం గురించి, కుక్కలు, కార్లు గురించి (ముఖ్యంగా ఆ రెంటికీ ఏమన్నా అయితే వాటికి చికిత్స ఏవిటి? అసలు వాటిని ఆరోగ్యంగా ఎలా వుంచాలి?), ప్రభుత్వ వైఖరి గురించి, రాబోయే రేసు పందాల్లో వైల్డ్ వెస్ట్ ఏ స్థానంలో రావచ్చు, పొద్దున్నే బాత్రూంలో అడుగుపెట్టగానే కళ్ళజోడుతో ఒట్టి తువ్వాల కట్టుకు న్న శవం కనిపిస్తే కర్తవ్యం ఏవిటి? (ముఖ్యంగా ఈ టాపిక్ మాత్రం ఈమధ్య శవ సాహిత్యాన్ని అవుపోసన పడుతున్న అవతారం నించి వచ్చింది) – భోజనం చేసినంతసేపూ యిలా ఎన్నో విషయాలు మాట్లాడుకున్నారు.

చేతులు కడుక్కుని, తాంబూలం దట్టించి, పైపు ముట్టించిన తరవాత రావుబహదూర్ సోమేశ్వర్రావు సంభాష ణలో అంశాల్ని మరింత విస్తరించే ప్రయత్నం చేశాడు.

తృప్తిగా పొగ పీల్చి వదుల్తూ యిలా అన్నాడాయన: 'నౌకర్లు దూరంగా వుంటే ఎంత వెసులుబాటుగా వుందో గమనించావా? ఆప్తులు ఎంత దూరంగా వుంటే అంత మంచిదన్న మాటలో వున్న గూఢార్థం యిప్పుడు తెలిపింది. అలా అని శేషయ్య గొప్ప ఆప్తుడని భ్రమసిపోకు. నాకు అతని మీద కేవలం ఓరకమైన అభిమానం, అనురాగం మాత్రమే, అంతే. అదలా వుంచు. అబ్బాయ్ అవతారం, నువ్విలా వచ్చినందుకు చాలా సంతోషంగా వుందయ్యా. ఇహపోతే నీ ముందు కార్యక్రమం గురించి వినాలని మహా కుతూహలంగా వుందయ్యా.'

'ఓహో అలాగా!' అన్నాడు అవతారం.

ముక్తసరిగానే అన్నాడామాట. అవతారం సన్నగా రివటలా వుండి, రాగిరంగు జుట్టుతో, మంచి ముఖవర్చస్సుతో చూడ్డానికి అందంగా వుంటాడు. కాని యిప్పుడా ముఖాన్ని దగ్గిరగా వెళ్ళి పరీక్షిస్తే దాంట్లో ఒక విధమైన ఆందోళన కనిపిస్తుంది – బలి చక్రవర్తి వామనుడికి మూడడుగులు దానం చేస్తాననంగానే శుక్రాచార్యులవారి మొహంలో కూడా యిలాంటి ఆందోళనే కనిపించిందట. బాబాయితో వంటరిగానే వున్నాడు కనక ఈసారి మాత్రం ఆయన మాటలకి బోల్తా పడకూడదు, గుండె దిటవుగా వుంచుకుని, రక్షణగా ఇనప కవచం తొడుక్కుని అడ్డుకోవాల్సిన అవసరం ఎంతైనా వుందని అవతారం నిశ్చయించుకున్నాడు. భోజనాలప్పుడు మాటల్లో మాటగా తన భార్య రంగూను వెళ్ళిన సంగతి చెబుతుంటే – చిరుతిళ్ళు దాచుంచిన అలమరా తాళంచెవి ఎక్కడుందో తెలిసిన వంటరి పిల్లాడి ముఖంలో కనిపించే వెలుగులా – బాబాయి కళ్ళు మిలమిలా మెరిశాయి. అలాంటి మెరుపు తనకి బాగా పరిచయం, అది కలిగినప్పుడల్లా ఆయన తనని

ఘోరమైన వుపద్రవాల పాలుచేశాడు. వడ్డన మొదలయినప్పుడు ఆయన కళ్ళల్లో చిగురించిన వెలుగు ఇప్పుడు – పైపు పీలుస్తున్నప్పుడు – మరింత తేజోవంతమయింది. తనే బయటపడుతాడులే అని అవతారం వదిలేశాడు.

'అసలు తాడంకివారి శ్రీలక్ష్మీనివాసంలో నీ మకాం ఎన్నిరోజులపాటయ్యా?' అని అవతారాన్ని వాళ్ళ బాబాయి అడిగాడు.

'బహుశా ఓ వారం రోజులపాటు.'

'ఆ తరవాత?'

'ఏముందీ, మళ్ళీ బెజవాడకి తిరుగు ప్రయాణం.'

'మంచిదయ్యా,' అన్నాడు రావుబహదూర్ సోమేశ్వర్రావు తృప్తిగా. 'అసలు ఆ సంగతే స్పష్టంగా తెలుసుకోవాల నుకున్నాను. మళ్ళీ బెజవాడకేగా వెళ్ళేది. భేష్, మహ బావుందయ్యా. అక్కడే కలుస్తాన్లే నిన్ను. నీతోబాటు రెండు రోజులు గడుపుతా – ఎంచక్కా మనిద్దరం సాయంత్రం పూట అలా అలా షికార్లు కొడుతూ బాగా ఎంజాయ్ చెయ్యాలి. అది నీకు ఎజుకేషన్, ట్రెయినింగ్ కూడాను. ఏమంటావ్?' ఆ మాటతో అవతారం బిక్కచచ్చి బిగుసుకుపోయాడు. ''హరి దేవుడా'' అన్న మాట బయటకి రాకపోయినా బాబాయి వంక అతను చూసిన చూపులో అది నిగూఢమై వుంది. అయితే యిప్పటి దాకా తను వూహించిందంతా నిజమేనన్నమాట. ఇన్నిరోజులూ ప్రేమతో పిన్ని కాస్తున్న కాపలానించి విముక్తి చెందిన బాబాయి, శ్రీశ్రీశ్రీ జమీందార్ కనకవల్లి సోమేశ్వర్రావు రావుబహదూర్‌గారు నీళ్ళల్లోంచి బయటపడ్డ చేపలా విచ్చల విడిగా తిరిగి ఆకతాయి పనులు, పోకిరీ చేష్టలు చెయ్యాలని పథకం పన్నుతున్నాడన్నమాట.

ఈవిషయం గురించి బెజవాడలో తన కనకదుర్గా క్లబ్బులో చాలాసార్లు చర్చకి వచ్చింది. కోవిదుడైన సాటి సభ్యుడు ఒకసారి యిలా చెప్పాడు: ''వాళ్ళ బాబాయి పేరు చెప్పగానే అవతారం వులిక్కిపడి అమాంతం రెండు గ్లాసుల బ్రాంది గటగటా మింగేస్తాడెందుకో తెలుసా? నేచెప్తా వినండి. ఆ బాబాయిగారు కల్తీలేని మేలిమి డైనమైట్! అవతారాన్ని వెంటేసుకుని విచ్చలవిడిగా వీరవిహారం చేసినప్పుడల్లా ఆయన్లో వుత్సాహం పొంగిపోయి, వుద్రేకం పరవళ్ళు తొక్కి, ఇంతింతై వటుడింతయై అన్నట్టు మరింత పెరిగిపోయి, మనవాడిని ఎన్నోసార్లు అనేక రకాల ఇబ్బందుల్లో పెట్టాడు, సంక టంలో యిరికించాడాయన. చింత చచ్చినా పులుపు చావనట్టు వయసు ముదిరినవాడే అయినా అలాంటి సందర్భాల్లో ఆయన తన వయసు కేవలం ఇరవై రెండుగా భావిస్తాడు. *బరితెగించి, మితిమీరి* అన్న మాటలకి మీకు అర్థం తెలుసో లేదో – బరిలోకి దిగిన తరవాత ఆయన చేసే చిలిపి పనులని అల్లరి చేష్టలుగా భాష్యం చెప్పుకోవచ్చు. ఓరోజు వాళ్ళిద్దరూ చీకటి పడ్డాక తిరణాలకి వెళ్ళినప్పుడు ఆయన చేసిన భాగోతం అవతారం నోటినించే వినాలి మీరు.''

ఇలాంటి ఘాటు విమర్శలు రావుబహదూర్ సోమేశ్వర్రావుగారిదాకా చేరివుంటే వాటితో ఆయన పూర్తిగా ఏకీభవించకపోయినా వాటి సారాంశాన్ని మాత్రం పూర్తిగా వొప్పుకుంటాడు. చిన్నప్పటినించి అల్లరిపనులు చేస్తూ ఎంతో సంతోషంగా గడిపాడాయన. అయితే వయసు మళ్ళినా ఇంకా పాత రుచులు, పాత వాసనలు తెంపుకోకుండా కైపులో వున్న కాలేజీ కుర్రాడిలా మానసికంగా అదే వయసులో వుండిపోయాడాయన. సంవత్సరాల తరబడి అవతారం సరసన యిలాంటి చేష్టలు చేస్తూ మితిమీరుతున్నట్టు గ్రహించినా మరింతగా ఆనందిస్తూ, ఆస్వాదిస్తూ గడిపాడాయన. ముఖ్యంగా తిరణాల్లో ఆరోజు రాత్రి. అసలు ఆరోజు రాత్రి కూడా కొంచెం బుద్ధున్న పోలీసయితే ఏదో ఇంత మందలించి యింటికి పంపించుండేవాడని యిప్పటికీ రావుబహదూర్ సోమేశ్వర్రావుగారి వాదన.

సోమేశ్వర్రావు మళ్ళీ తన ధోరణి కొనసాగిస్తూ యిలా అన్నాడు. 'బహుశ ఇందాక నేను చెప్పినప్పుడు నిద్ర పోతునట్టున్నావ్, అందుకని మళ్ళీ ఇంకోసారి చెబుతున్నా – మీ పిన్నిగారు యింకో రెండు మూడు నెలలదాకా తిరిగొచ్చే

ప్రసక్తి లేదు. వంటరిగా నన్నిక్కడ వదిలేసి వెళ్లింది. ఇలాంటి పరిస్థితుల్లో నాకెంత బాధగా వుంటుందో నువ్వు వూహించుకోగలవు కదా. అయినా కాని...'

'నామాట వినండి బాబాయ్.'

'...అయినా కాని ఎంతటి కారుమబ్బుల్లోనైనా శ్రద్ధగా మనం పరికిస్తే సన్నటి వెలుగు రేఖ ఎప్పటికీ కనిపిస్తుంటుంది. అదేవిధంగా యిప్పుడు నేనున్న ఈ అధ్వాన్నపు పరిస్థితుల్లో కూడా కనిపించే వెలుగురేఖ ఏవిటంటే నేను మళ్ళీ చలాకీతనంతో చలామణి అవ్వొచ్చు – కొన్ని రోజుల పాటైనా. అసలు మీ పిన్ని అంటే నాకు విపరీతమైన ప్రేమ. ప్రపంచంలో అందర్లోకి నాకు యిష్టమైన వ్యక్తి ఆమే. అయితే, మరీ కూడా కూడా తిరుగుతూ వుంటే అప్పుడప్పుడు నాక్కొంచెం ... దాని పేరేవిటి చెప్మా ... ఆ ... క్రమశిక్షణ మోతాదు ఎక్కువేమోనని అనిపిస్తూ వుంటుంది. నన్ను బెజవాడలో వదిలేస్తే నేను విచ్చలవిడి అయిపోతానని ఆవిడకొక దురభిప్రాయం. ఏతా వాతా, ఆవిడ వున్నప్పుడయితే తలు చుకున్నట్టు చెయ్యడానికి అస్సలు వీలుపడదు. అందువల్ల యిలా మారుమూల ఈ కుగ్రామంలో కాలం వెళ్ళబుచ్చుతున్నా. సాటివాళ్ళు సానుభూతి చూపించాల్సిన విషయం యిది. ఇలా ఈ శ్మశానంలో కూపస్థ మండూకంలా వుండిపోతే నా బుర్రకి తుప్పుపట్టి సరికొత్త ఆలోచనలకి సుదూరం అయిపోతున్నాను. మచ్చుకి ఒక వుదాహరణ చెప్తుతున్నా చూడు – బెజవాడలో ఏ రోడ్డులో ఏ సినిమాహాలు వుందో, మొదటాట అవంగానే రెండో ఆటకి దగ్గిర దారేదో మునుపు కళ్ళు మూసుకుని చెప్పగలుగుతుండేవాణ్ణి. ఇప్పుడది నావల్ల కాదు. అంచేత...'

'నామాట వినండి, బాబాయ్.'

'...అంచేత, పెట్టె, బేడా సర్దుకుని ఆవిడ రంగూనుకి వెళ్ళడంతో నా జీవితంలో చీకటి కమ్ముకున్నట్టు అనిపించినా, ఆవిడలేని నా వునికి వృధా అనిపించినా – ఈ ఆటవిడుపు సమయాన్ని సదుపయోగం చేస్తూ యధేచ్ఛగా తిరగాలని మహా సరదాగా వుందయ్యా. అది నెరవేర్చుకునేందుకు ఎలాంటి అవాంతరాలనయినా ఎదుర్కొనే ధైర్యం వుంది. అందుకని నువ్వు బెజవాడ తిరిగి వెళ్ళిన వైనం శీఘ్రంగా నాకు కనక తెలియపరిస్తే రెక్కలు కట్టుకుని నీ పక్కనొచ్చి వాల్తాను. దేవుడు మేలుచేసి మళ్ళీ నాలో యువక రక్తం పరవళ్ళు తొక్కుతోందయ్యా. దీనికంతతటికీ కారణం బహుశ యింత మంచి వాతావరణమే కావచ్చనుకుంటా.'

అవతారం అర్జెంటుగా అరగ్లాసు బ్రాంది పుక్కిలించి మరీ మింగాడు. దాంతో మొహం ఎర్రబడి గంభీరంగా మారింది.

'నామాట వినండి బాబాయ్,' అరిగిపోయిన గ్రామఫోను రికార్డులా అవతారం మళ్ళీ అని, 'ఇహమీదట అలాంటి చేష్టలు కుదరవు బాబాయ్,'' అన్నాడు.

'కుదరవా?'

'కుదరవంటే కుదరవు. నన్ను మళ్ళీ మీతో తిరణాల్లో తిప్పకండి.'

'తిరణాలక్కాకపోతే యింకోదానికి. తిరణాలకే పోవాలని పట్టుబట్టానా? కాబోతే ప్రజల్లో వుండే భక్తి విశ్వాసాల్ని అలాంటి చోట్ల కొంతవరకు అధ్యయనం చెయ్యడానికి వీలుపడుతుంది మనకి.'

'తిరణాలకే కాదు, మీరు తిప్పే చోట్లలో నేను వేటికీ రాను. ఒక్కమాటలో చెబుతా, దయచేసి యికనించి నా బాటనే మీరూ తొక్కండి. అలా అని మీరు బెజవాడ వచ్చినప్పుడు మీకు ఏవిధంగానూ తక్కువ చెయ్యను. రెండు పూటలా కడుపునిండా భోజనం పెట్టి, కాలక్షేపానికి పుస్తకాలు తోడిచ్చి, యింట్లో హాయిగా పడక ఏర్పాటు చేస్తాను. అంతకుమించి యింకేం కుదరదు, అంతేకాదు మితిమీరి ఆశించవద్దు.'

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Uncle+Dynamite**

* * *